క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం


దాత మాధవరెడ్డికి స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రావులపాలెం వాస్తవ్యుడు గొలుగూరి మాధవరెడ్డి దంపతులు శుక్రవారం రూ.10,150 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులకు అందజేశారు. దాతను సత్కరించి స్వామి చిత్రపటం ప్రసాదం ఇచ్చారు.

కలెక్టర్‌ను కలసిన జెడ్పీటీసీలు

కొత్తపేట: జిల్లా సివిల్ సప్లయిస్ కమిటీ సభ్యులుగా నియమితులైన జెడ్పీటీసీలు కలెక్టర్ మహేష్‌కుమార్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వం ఇటీవల జిల్లా సివిల్ సప్లయిస్ కమిటీల పునరుద్ధరణలో భాగంగా ఆ కమిటీ సభ్యులుగా స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవితో పాటు అల్లవరం, ముమ్మిడివరం, కపిలేశ్వరపురం జెడ్పీటీసీ సభ్యులు కొనుకు గౌతమి, కుడుపూడి శివశంకరరావు, పుట్టపూటి వీరవెంకట సత్యనారాయణలను నియమించిన విషయం తెలిసిందే. రమాదేవి ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలసి సత్కరించారు.

గోధుమ తాచు హల్‌చల్


పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ వర్మ

అంబాజీపేట: మాచవరం డైలీ మార్కెట్ వెనుక ఉన్న వెలవలి రామారావు ఇంటి ప్రాంగణంలో శుక్రవారం రాత్రి ఆరు అడుగుల గోధుమ తాచు హల్‌చల్ చేసింది. దీంతో భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మకు సమాచారం అందించారు. అక్కడకు వర్మ చేరుకుని తాచుపామును పట్టుకున్నారు. అనంతరం ప్లాస్టిక్ బాటిల్‌లో బంధించి జన సంచారం లేని ప్రాంతంలో వదిలిపెట్టారు.

సేవలను ఆదర్శంగా తీసుకోవాలి


మహిళలకు చీరలు, దుప్పట్లను పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే సత్యనారాయణ

అంబాజీపేట: సినీ నటుడు మహేష్‌బాబు చేస్తున్న సేవలను అభిమానులు ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేటలో మహేష్‌బాబు పుట్టిన రోజు వేడుకలను అభిమానులు శుక్రవారం నిర్వహించారు. అనంతరం మహేష్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు దొమ్మేటి రవికిరణ్, ఉపాధ్యక్షుడు పితాని జయకృష్ణ, కార్యదర్శి పితాని మహేష్, జాయింట్ సెక్రటరీ వాసంశెట్టి సాయి, ఇన్‌చార్జి మామిడిశెట్టి నాని ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, 150 మంది వృద్ధులకు చీరలు, దుప్పట్లు, భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, పాల్గొన్నారు.

మహేష్‌బాబు జన్మదిన వేడుకలు

పి.గన్నవరం: సినీ నటుడు మహేష్‌బాబు జన్మదిన వేడుకలను పి.గన్నవరం మెయిన్‌రోడ్‌లో శుక్రవారం రాత్రి ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఎంబీఎఫ్‌సీ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 40 అడుగుల కటౌట్ వద్ద మహేష్‌బాబు బర్త్ డే కేకును కట్ చేశారు. సంఘ సభ్యులు వెంకీ, దిను, గణేష్, రమేష్, శంకర్ పాల్గొన్నారు.

అభిమానుల ఉదారత

మలికిపురం: స్థానిక సెంటర్‌లో సూపర్ స్టార్ మహేష్‌బాబు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కేకును గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్ కట్ చేశారు. టేకిశెట్టిపాలెం వరద బాధితులకు ఫ్యాన్స్ భోజన వసతి కల్పించారు. విశ్వేశ్వరాయపురం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం అందించారు. గూడపల్లిలో మెదడు వాపు వ్యాధితో బాధపడుతున్న కుసుమ అమూల్యకు రూ.10 వేలు ఇచ్చారు.

జాబ్ మేళాలతో భరోసా

కొత్తపేట: జాబ్ మేళాలు యువతకు భరోసాగా నిలుస్తాయని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక శతాబ్ది డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. 709 మంది నిరుద్యోగులు రాగా 223 మంది ఎంపికయ్యారు.

ముంపు నుంచి ముక్తికి..

- అవుట్‌ఫాల్ స్లూయిజ్ సమస్య పరిష్కారం
- తేలికపాటి తలుపులతో తొలగిన ముంపు
- గత ప్రభుత్వంలో రూ.40 లక్షలతో పనులు


అంతర్వేది ఏటిగట్టు వద్ద నవా డ్రైన్ అవుట్‌ఫాల్ స్లూయిజ్‌కు ఏర్పాటు చేసిన తేలికపాటి తలుపులు


2022 జూన్‌లో నవా అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ను పరిశీలించిన అప్పటి కలెక్టర్ హిమాన్షు శుక్లా (ఫైల్)

సఖినేటిపల్లి: ఆలోచనకు ఆచరణ తోడైతే, దానికి ప్రభుత్వం సహకారం అందిస్తే ఏ సమస్య అయినా ఇట్టే పరిష్కారమవుతోంది. అది అందరికీ ఉపయోగకరమవుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అంతర్వేది ఏటిగట్టుకు ఉన్న గొంది, నవా డ్రైన్ల అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల సమస్య పరిష్కారమైంది. ముంపు సమస్య తప్పింది. ఈ స్లూయిజ్‌కు 2016–18 మధ్య సమయంలో గత టీడీపీ హయాంలో అధిక బరువు కలిగిన తలుపులు ఏర్పాటు చేయడంతో అవి తెరుచుకోక, ముంపునీరు దిగక రైతులు నానా అవస్థలు ఎదుర్కొన్నారు. నీటి ప్రవాహం అంచనాలకు మించి అధిక బరువు ఉండే తలుపులను అమర్చడంతో సమస్య ఉత్పన్నమైంది. ఈ తలుపుల కారణంగా క్రమేపీ ముంపు నీరు గోదావరిలో దిగడానికి సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీనివల్ల గోదావరి పోటు, పాటులకు తగ్గట్టుగా బరువు గల తలుపులు మూసుకుని, తెరుచుకోవడంలో అవాంతరాలు ఏర్పడ్డాయి. ఈ తరుణంలో వరి చేలల్లో సకాలంలో ముంపునీరు దిగక రైతులు తీవ్ర ముంపు సమస్యలను ఎదుర్కొన్నారు. అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల ద్వారా తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా సుమారు ఎనిమిది వేల ఎకరాల్లోని వరి చేలల్లో ముంపు నీరు దిగక రైతులు తీవ్రంగా నష్టపోయేవారు.

ముంపునీరు దిగేలా..

అంతర్వేది వద్ద ఏటిగట్టుకు రాళ్ల, గొంది, నవా డ్రైన్లకు పూర్వ కాలంలో అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు ఏర్పాటు చేశారు. ఈ మూడు స్లూయిజ్‌ల ద్వారా మండలంలోని వివిధ గ్రామాల నుంచి ముంపు నీరు గోదావరిలోకి దిగడానికి వీలుగా తలుపులు ఏర్పాటు చేశారు. గోదావరి పోటుకు తలుపులు మూసుకుపోయేలా, పాటుకు తలుపులు తెరుచుకుని చేలల్లో ముంపు నీరు దిగేలా వీటిని నిర్మించారు. అవి బరువుగా ఉండడంతో సమస్య వచ్చింది.

పరిశీలించి.. స్పందించి

అంతర్వేది ఏటిగట్టుకున్న గొంది, నవా మురుగు కాలువల అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను అప్పటి కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించారు. 2022 జూన్‌లో స్లూయిజ్ షట్టర్లు సక్రమంగా పనిచేయడం లేదంటూ రైతుల నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఏటిగట్టుకు ఉన్న పైరెండు అవుట్‌ఫాల్ స్లూయిస్ షట్టర్లకు మూవ్‌మెంట్ లేదని ప్రజాప్రతినిధులు కూడా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. షట్టర్లు మూవ్‌మెంట్ సక్రమంగా ఉండేటట్టుగా చేపట్టాల్సిన చర్యలను పరిశీలించాలని కలెక్టర్ హెడ్‌వర్క్స్, డ్రైన్ల అధికారులకు సూచించారు.

మాజీ ఎమ్మెల్యే చొరవతో..

గొంది, నవా డ్రైన్ల ద్వారా తమ చేలల్లో ముంపు నీరు దిగక ఇబ్బందులు పడుతున్నామంటూ రైతులు చేసిన విజ్ఞప్తిపై అప్పట్లో మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు చొరవ చూపారు. ఈ సమస్యను అప్పటి కలెక్టర్ హిమాన్షు శుక్లా దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కలెక్టర్ పైరెండు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లకు ఫ్లాప్ సిస్టంలో తేలికపాటి తలుపులు ఏర్పాటుకు మొత్తం రూ.40 లక్షల నిధులు విడుదల చేశారు. ఈ నిధులతో రాజోలు హెడ్‌వర్క్స్ శాఖ సదరు పనులను 2023 అక్టోబర్‌లో పూర్తి చేసింది. దీంతో మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులకు ప్రస్తుత వర్షా కాలంలో ముంపు నుంచి విముక్తి కలిగింది.

సమస్యకు చెక్

మండలంలో గొంది, నవా డ్రైన్‌లపై నెలకొన్న ముంపు సమస్య అప్పటి కలెక్టర్ సహకారంతో తొలగింది. అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లకు బరువు తలుపులు స్థానే తేలికపాటి తలుపులు ఏర్పాటుకు కలెక్టర్ ఇచ్చిన సహకారం మరువలేం. అధికారులు చేపట్టిన పనులతో రైతులకు ప్రస్తుత సార్వా సీజన్‌లో ఊరట కలిగింది.



– రాపాక వరప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే, రాజోలు

తలుపుల ఏర్పాటుకు రూ.40 లక్షలు

అప్పటి కలెక్టర్ హిమాన్షు శుక్లా గొంది అవుట్‌ఫాల్ స్లూయిజ్‌కు రూ.22 లక్షలు, నవా అవుట్‌ఫాల్ స్లూయిజ్‌కు రూ.18 లక్షలు కలిపి మొత్తం రూ.40 లక్షలు ఇచ్చారు. ఈ నిధులతో 2023 అక్టోబర్‌లో పైరెండు స్లూయిజ్‌లకు ఫ్లాప్ సిస్టంలో తేలికపాటి తలుపులు కొత్తగా ఏర్పాటు చేశాం. పోటు, పాటులకు తగ్గట్టుగా ఇవి బాగా పనిచేస్తున్నాయి.

– టీవీఎల్ఎస్ మూర్తి, హెడ్‌వర్క్స్ ఏఈ, రాజోలు

తహసీల్దార్లుగా బాధ్యతల స్వీకరణ


అయినవిల్లిలో తహసీల్దార్ శ్రీపల్లవికి స్వాగతం పలుకుతున్న సిబ్బంది


వెంకటేశ్వరి


కాశీవిశ్వేశ్వరరావు


ముక్తేశ్వరరావు


మృత్యుంజయరావు

అయినవిల్లి/ అంబాజీపేట/ మలికిపురం/ రావులపాలెం/ పి.గన్నవరం: కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో పలువురు తహసీల్దార్లుగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అయినవిల్లి తహసీల్దార్‌గా టి.శ్రీపల్లవి చేరారు. ఇప్పటి వరకూ పనిచేసి డీఎల్ ప్రమద్వార చింతలపూడికి బదిలీపై వెళ్లారు. పల్లవికి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. అంబాజీపేట తహసీల్దార్‌గా జె.వెంకటేశ్వరి బాధ్యతలు చేపట్టారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయ సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తానన్నారు. మలికిపురం తహసీల్దార్‌గా కె.కాశీవిశ్వేశ్వరరావు, సఖినేటిపల్లి తహసీల్దార్‌గా సీహెచ్ నాగలక్ష్మమ్మ త్వరలో బాధ్యతలు తీసుకోనున్నారు. రావులపాలెం తహసీల్దార్‌గా బీఎం ముక్తేశ్వరరావు చేరారు. ప్రస్తుతం ఇక్కడ విధుల్లో ఉన్న అశోక్‌వర్మ తణుకుకు బదిలీ అయ్యారు. పి.గన్నవరం తహసీల్దార్‌గా బండి మృత్యుంజయరావు బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డీటీ దేవళ్ల శ్రీనివాస్, సిబ్బంది స్వాగతం పలికారు.

అంబేడ్కర్ విగ్రహంపై అక్కసు ఆటవిక చర్య


ముసునూరి వెంకటేశ్వరరావు

కొత్తపేట: అంబేడ్కర్ విగ్రహంపై అక్కసు వెళ్లగక్కుతూ పచ్చ మూకలు చీకటి దాడి చేయడం ఆటవిక చర్య అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మాజీ ప్రచార కార్యదర్శి ముసునూరి వెంకటేశ్వరరావు అన్నారు. విజయవాడలో సామాజిక న్యాయ మహాశిల్పంపై సుత్తులు, ఇతర పరికరాలతో దాడి, మహాశిల్పం బోర్డు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును చీకటి మాటున పచ్చ మూకలు ధ్వంసం చేయడాన్ని ముసునూరి తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019లో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన మరుక్షణం నుంచీ సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడితే, ఈ ఏడాది చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టినప్పటి నుంచీ వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు శ్రీకారం చుట్టారన్నారు. జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఆందోళన కలిగిస్తుందన్నారు. సీఎం చంద్రబాబుకు గాని, ఆ ప్రభుత్వానికి గాని ఎప్పుడూ అంబేడ్కర్ అన్నా.. దళిత జాతి అన్నా గౌరవం లేదన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం..


మామిడికుదురులో వర్గీకరణపై నిరసన తెలుపుతున్న మాలల న్యాయ పోరాట సమితి

మామిడికుదురు: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని మాలల న్యాయ పోరాట సమితి పేర్కొంది. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో మాలల న్యాయ పోరాట సమితి సమావేశానికి నల్లి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఈ నెల 21న నిర్వహించనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సూచించారు. దీని కోసం కమిటీని ఏర్పాటు చేశారు. వర్గీకరణ రాజ్యాంగానికి విరుద్ధమని రిటైర్డ్ ఉద్యోగి భూపతి వెంకటపతి, బొంతు మణిరాజు, మట్టా సత్తిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. వర్గీకరణతో మాలలు తీవ్రంగా నష్టపోతారన్నారు. సమావేశంలో నెల్లి దుర్గాప్రసాద్, కలిగితి పళ్లంరాజు, గెడ్డం వెంకటేశ్వరరావు, పిల్లి శ్రీనివాస్, కుసుమ పెరుమాళ్లకుమార్, బత్తుల మురళీకృష్ణ, బత్తుల జనార్దనరావు, చింతా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకూ రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పీపీ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఆయా సర్పంచులతో పాటు పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకూ శిక్షణ తీసుకుంటారన్నారు. తనతో పాటు రామేశ్వరం పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి దాసరి సత్యనారాయణ, వీపీ మెరక పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ అడబాల గంగరాజు శిక్షణ ఇస్తారన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అయినవిల్లి: స్థానిక దూనబోయినవారిపాలేనికి చెందిన పాటి హేమప్రియకు మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం రూ.50 వేల సాయం అందజేశారు. హేమప్రియ వెన్నుముక సంబంధించిన శస్త్ర చికిత్స చేయించుకుంది. ఆమెకు మంత్రి సాయం అందజేశారు.

ఇస్లాం అంతానికే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు

మండపేట: పార్లమెంటులో ఎన్డీయే కూటమి వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ప్రవేశపెట్టి ముస్లింల మనోభావాలను దెబ్బతీసిందని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, షేక్ అండ్ షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్‌బాబా ఆగ్రహం వ్యక్తం చేశారు.శుక్రవారం పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వక్ఫ్ బోర్డు అధికారాలను తగ్గించి బోర్డులో ఇతరులకు అధికారాలు కట్టబెట్టడం కేంద్ర ప్రభుత్వ కుట్ర అని ఆరోపించారు. వక్ఫ్ బోర్డుపై జిల్లా కలెక్టర్ ఆజమాయిషీ అంటే అదొక వివాదాస్పద అంశం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు వల్ల దేశంలోని ముస్లింలపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సవరణ వల్ల ముస్లిం సమాజం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇస్లాంను పూర్తిగా అంతమొందించాలన్న లక్ష్యంతో ఈ అంశాన్ని తెరమీదకు తెచ్చి వివాదాస్పదంగా మార్చారని విమర్శించారు. స్వతంత్రంగా ఉన్న వక్ఫ్ బోర్డు అన్యాక్రాంతం అయిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

వరలక్ష్మీ ప్రణమామ్యహం


అప్పనపల్లిలో సామూహిక వ్రతాల్లో మహిళలు


అంతర్వేది ఉపాలయంలో పూజా ఏర్పాట్లను పర్యవేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ

మామిడికుదురు: శ్రావణ మాసంలో మొదటి శుక్రవారాన్ని భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కోలాహలంగా మారింది. ఇందులో భాగంగా అమ్మవారి కలశ స్థాపన, శోడషోపచార పూజ, తోర గ్రంధి పూజ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలను ఆలయ అర్చకులు, వేద పండితులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, జ్యోత్సుల సోమయాజులు జరిపించారు. ఆలయ ఈఓ జి.మాధవి పర్యవేక్షణలో సామూహిక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉచితంగా పూజా సామగ్రి, రూపు అందజేశారు.

అన్నపూర్ణాదేవికి కుంకుమ పూజలు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో కొలువైన అన్నపూర్ణాదేవి అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు జరిపారు. అర్చకుడు అల్లవరపు సూరిబాబు ఆధ్వర్యంలో సహస్ర కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అలాగే క్షణముక్తేశ్వర స్వామి, కనకదుర్గ ఆలయాల్లో శ్రావణ మాస పూజలు జరిగాయి.

అంబాజీపేట: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అంబాజీపేట, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, ఇరుసుమండ, ముక్కామల తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా కుంకుమ పూజలు నిర్వహించారు.

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలోని ఉపాలయంలో కొలువైన రాజ్యలక్ష్మీ తాయారు సన్నిధిలో సామూహిక వరలక్ష్మి పూజలు నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పూజా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ నేతృత్వంలో మహిళలు పూజలు చేశారు. దేవస్థానం తరపున అమ్మవారి రూపు, పూజా సామగ్రి ఉచితంగా అందజేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్ దర్శనం, ప్రసాద వితరణ చేసి, నిత్యాన్నదాన పథకంలో భోజన వసతి కల్పించారు.

మాతా, శిశు మరణాల నియంత్రణకు కృషి


పెనికేరులో బాలింతలు, గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి భవానీశంకర్

ఆలమూరు: మాతా, శిశు మరణాల నివారణకు ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలా దేవి, డి.సాయికిశోర్, ఆర్.మల్లికార్జున్ కోరారు. చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో శుక్రవారం పీఎంఎస్ఎంఏ శిబిరాలు జరిగాయి. అలాగే ఆయా ఆయుష్మాన్ భారత్ మందిరాల్లో బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 127 మంది గర్భిణులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. గర్భిణులకు పౌష్టికాహారాన్ని ఇచ్చారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ పాల్గొన్నారు.

పి.గన్నవరం: ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా పి.గన్నవరం సీహెచ్‌సీలో గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వై.కొత్తపల్లికి చెందిన వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో వారికి పౌష్టికాహారం అందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, ఎంపీటీసీ పులపర్తి చినవెంకటేశ్వరరావు, నాయకులు నల్లా పెదకాపు, కొండా భాస్కరరావు, తక్రరి బాబూరావు పాల్గొన్నారు. నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి వైవీ ప్రియాంక ఆధ్వర్యంలో 43 మంది గర్భిణులకు వైద్య సేవలు అందించారు.

స్వల్ప పెట్టుబడితో అధిక దిగుబడులే లక్ష్యం

'ఆత్మ' ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతిర్మయి


పొలంబడిని క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న ఆత్మ పీడీ జ్యోతిర్మయి, వ్యవసాయ అధికారులు

రాయవరం: శాస్త్ర సాంకేతిక పద్ధతులను ఉపయోగించి రైతులు తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడి సాధించేలా తీర్చిదిద్దడమే 'ఆత్మ' ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని ఆ ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతిర్మయి తెలిపారు. మండలంలోని చెల్లూరు గ్రామంలో ఆత్మ సౌజన్యంతో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ పీడీ జ్యోతిర్మయి మాట్లాడుతూ ఆత్మ సౌజన్యంతో రైతులకు శిక్షణ, ప్రదర్శన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని, ద్రవరూప జీవన ఎరువుల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే భాస్వరానికి బ్యాక్టీరియా, పొటాషియం రిలీజింగ్ బ్యాక్టీరియా గురించి వివరించారు. వాటిని ఎకరానికి 500 మిల్లీలీటర్ల పశువుల ఎరువు లేదా సేంద్రియ ఎరువుతో కలుపుకొని విత్తనం నాటేటప్పుడు కానీ లేదా వారం రోజుల్లో పొలంలో చల్లుకోవాలన్నారు. ఆలమూరు ఏడీఏ నాగేశ్వరరావు మాట్లాడుతూ సెప్టెంబరు 15వ తేదీలోగా రైతులు విధిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు వలన కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్ ఎరువుల యాజమాన్యం గురించి మాట్లాడుతూ భూమిలోని పోషకాలు తెలుసుకునేందుకు విధిగా మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వచ్చే పురుగులు, తెగుళ్ల గురించి వివరిస్తూ, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బాబురావు ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం తయారీ విధానం గురించి వివరించారు. అనంతరం మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించిన పొలంబడిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు చంద్ర వీర్రాజు, ముత్యాల పెదపూడి, దేవు శ్రీను అధిక సంఖ్యలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

యూత్ ఫెస్ట్ పోటీల్లో ప్రతిభ


విజేతలతో డీఎంహెచ్ఓ దుర్గారావుదొర

కొత్తపేట: యూత్ ఫెస్ట్ మారథన్ రెడ్ రన్ 5 కేఎమ్ జిల్లా స్థాయి పోటీల్లో స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. హెల్త్ డిపార్ట్‌మెంట్ డిస్ట్రిక్ట్ ఎయిడ్స్ ప్రివెన్షన్, కంట్రోల్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఏపీ వైద్య విధాన పరిషత్ స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఐసీటీసీ కౌన్సిలర్ ఎం.దుర్గాప్రసాద్ ద్వారా డిగ్రీ కళాశాల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో బీకాం ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు వైపీఎస్‌డీ సంతోష్ ద్వితీయ, మహాలక్ష్మి తృతీయ స్థానాలు సాధించారు. వారిని డీఎంహెచ్ఓ దుర్గారావుదొర, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు, పీడీ కె.కనకరాజు తదితరులు అభినందించారు.

ఆలయ ఈఓగా నియామకం


ఉండవల్లి వీర్రాజు చౌదరి

ఆలమూరు: చింతలూరులో వేంచేసి ఉన్న శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి (ఈఓ)గా ఉండవల్లి వీర్రాజు చౌదరిని తిరిగి నియమించారు. గతంలో స్థానిక ఆలయ ఈఓగా పనిచేసిన ఆయన గత ఏడాది డిసెంబర్‌లో కె.గంగవరం మండలం కొత్తకోటలో ఉన్న రాజగోపాలస్వామి ఆలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. బదిలీల్లో భాగంగా డిప్యూటేషన్లు రద్దు కావడంతో ఈఓగా వీర్రాజు చౌదరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

రూరల్ సీఐగా విద్యాసాగర్


విద్యాసాగర్

రావులపాలెం: స్థానిక రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సీహెచ్ విద్యాసాగర్ నియమితులయ్యారు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చిన రామ్‌కుమార్ స్థానంలో ఎన్నికల అనంతరం జరిగిన బదిలీల్లో భాగంగా విద్యాసాగర్ రూరల్ సీఐగా నియమితులయ్యారు. గతంలో ఆయన రావులపాలెం, ఆలమూరు పోలీస్ స్టేషన్ల ఎస్సైగా పనిచేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా కౌన్సెలింగ్ ఇస్తామన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం


విశ్వేశ్వరాయపురంలో కాలిపోతున్న ద్విచక్ర వాహనం

మలికిపురం: స్థానిక విశ్వేశ్వరాయపురం బంక్‌లో పెట్రోలు నింపుకొని రోడ్డుపై ప్రయాణిస్తున్న సమయంలో మోటారు సైకిల్ కింద భాగం నుంచి ఒక్కసారిగా మంటలు రేగాయి. దానిని వదిలేసి ఆ వాహనదారుడు పరుగు పెట్టాడు. స్థానికులు వెంటనే మంటలను అదుపు చేశారు. ఈ వాహనం రామరాజులంక గ్రామానికి చెందిన శెట్టిం మహేష్‌కు చెందినదిగా గుర్తించారు.

జాతీయ జెండా ఎగురవేయాలి

సఖినేటిపల్లి: ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం సఖినేటిపల్లిలంకలో పడాల శ్రీను ఇంటి వద్ద ఆ పార్టీ మండల కార్యకర్తల సమావేశం జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు, నాయకులు శ్రీనివాస నగేష్, చెంపాటి శివ రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలి

పి.గన్నవరం: నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలకు ఎన్నికైన ఎస్ఎంసీ చైర్మన్లు, సభ్యులు ఆయా పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పి.గన్నవరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.

ఫొటోగ్రాఫర్‌కు సాయం

పి.గన్నవరం: ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న నరేంద్రపురానికి చెందిన ఫొటోగ్రాఫర్ మట్టపర్తి బ్రహ్మానందంకు మండల ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం రూ.5 వేల సాయం అందించారు. సభ్యులు కొక్కిరి రవికిరణ్, గూటం శ్రీనివాస్, షేక్ దొరబాబు, పోతంశెట్టి కిరీటి, మెల్లం వెంకటేశ్వరరావు, ఎంఎస్‌కే చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకుందాం

అంబాజీపేట: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అంబాజీపేట ఫ్రెండ్స్ ఫరెవర్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ సభ్యులు పేర్కొన్నారు. పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో సేవా కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏదొక రూపంలో ఎదుట వారికి సాయపడాలన్నారు. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు నాగాబత్తుల అవినాష్, ఉపాధ్యక్షుడు బోసి రాంబాబు, కార్యదర్శి రాము, ట్రెజరర్ ప్రసాద్, ఈసీ సభ్యుడు రవి పాల్గొన్నారు.